క్లుప్తంగా

నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక

లింగాల : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం ఉదయం లింగాల మండల కేంద్రంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం వడగండ్ల వాన, ఈదురు గాలులకు తీవ్రంగా దెబ్బతిన్న అరటి పంటలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరిశీలిస్తారన్నారు.

నేడు మండల సమావేశం

పెద్దముడియం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షంషాద్‌బాను తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించి ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

వడ్డీ రాయితీ గడువు పెంపు

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇప్పటి వరకు ఉన్న బకాయిలకు సంబంధించిన వడ్డీలో 50 శాతం రాయితీతో పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచిందని కమలాపురం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల 31వ తేదీ నాటికి ఆస్తి పన్ను బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ జరుగుతుందని ప్రభుత్వం అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఈ గడువును ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పెంచిందని ఆయన తెలిపారు. అలాగే 2025–26 ఏడాదికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లిస్తే అందులో 5 శాతం రిబేట్ వర్తిస్తుందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రామసూరారెడ్డి



సింహాద్రిపురం : సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా తొండూరు మండలం సంతకొవ్వూరు గ్రామానికి చెందిన రామసూరారెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. బుధవారం మార్కెట్ యార్డు చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు.

అశీర్వాదం

పెండ్లిమర్రి : మండలంలోని జంగంరెడ్డిపల్లెలో ఇటీవల వివాహమైన నూతన వధువరులు శివ శంకర్‌రెడ్డి, లక్ష్మి ప్రసన్న, నీలకంఠరెడ్డి, రేఖల రిసెప్షన్‌కు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై వారిని అశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వల్లూరు జెడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నివాళి



మహేశ్వరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లెలో దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలమల్లారెడ్డి కుమార్తె మహేశ్వరి మరణించింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం బయనపల్లెకు వెళ్లి మహేశ్వరి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కళాయాదవ్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ పవర్ స్ప్రేయర్స్ పంపిణీ

లింగాల : మండలంలోని పార్నపల్లె వెలిదండ్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో బుధవారం మండల వ్యవసాయాధికారి రమేష్ సిబ్బందితో కలిసి సబ్సిడీ పవర్ స్ప్రేయర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌తో నడిపే యంత్ర పరికరాలు సబ్సిడీతో ఉన్నందువల్ల కావలసిన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్కూల్ గుర్తింపు రద్దు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్‌జిల్లా కమలాపురంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ గుర్తింపును పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యామ్యూల్ రద్దు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులు ప్రస్తుతం ఇతర పాఠశాలల్లో చేర్పించుకోవాలని తెలిపారు. నూతనంగా ఏ విద్యార్థిని కూడా ఆ పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవద్దని డీఈఓ తెలిపారు.

ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డులో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

దళారుల చేతిలో అరటి రైతులు విలవిల



అరటి కాయలను కొనుగోలు చేసేందుకు తోటల వద్దకు వచ్చిన లారీ

సింహాద్రిపురం : అరటి రైతుల కష్టాన్ని దళారులు నిలువునా దోచుకుంటున్నారు. మార్కెట్‌పై అవగాహన లేక, అరటి కాయలను స్టోరేజ్ చేసుకోవడానికి వీల్లేక రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులపై ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు దళారులు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. రైతుల కంటే దళారులకే ఎక్కువ ఆదాయం ఉండటంతో అరటి సాగు చేసే గ్రామాల్లో పుట్టగొడుగుల్లా దళారులు పుట్టుకొస్తున్నారు. రైతుల నుంచి అరటి కాయలు కొనుగోలు చేసిన వారు డబ్బు కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో దళారుల మాటలు నమ్మి లక్షలాది రూపాయల విలువైన అరటి కాయల సరుకును అప్పు రూపంలో విక్రయించిన రైతులకు కుచ్చుటోపీ పెట్టిన సందర్భాలు ఉన్నాయి. కొందరు దళారులు అరకొర మొత్తాలను రైతులకు ఇచ్చి మిగిలిన మొత్తాలను స్వాహా చేసి పరారైన సందర్భాలున్నాయి. ఎక్కువగా అరటి కాయలను దళారులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, కలకత్తా, శ్రీనగర్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడి వ్యాపారులతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. దళారులకు వారు ఎంత డబ్బు ఇస్తున్నది వీరికి తెలియదు.

అరటి సాగుకు సింహాద్రిపురం మండలం ప్రసిద్ధి

మండలంలో 1450 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. అరటి రైతులు మూడు దఫాలుగా పంట దిగుబడి తీసుకుంటారు. నెల క్రితం అరటి టన్ను ధర రూ.27వేల నుంచి రూ.28వేల దాకా పలికింది. ప్రస్తుతం మొదటి పంట టన్ను రూ.10వేల నుంచి రూ.16వేలు, రెండవ పంటకు మొదటి పంట కన్నా రూ.4 వేలకు తక్కువ చేస్తారు. ఇలా రైతులకు అరటి ధర ఎంతుందో తెలియకపోవడంతో దళారులు అరటి రైతులను దగా చేస్తున్నారు. ఇక మూడవ పంట వైపు దళారులు కన్నెత్తి చూడరు మొదటి కాపులోనే దళారులు అరటి రైతులను దండుకుంటారు. దీంతో అరటి రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఎందుకంటే వారు అడిగిన రేటుకే ఇవ్వాలే తప్ప స్టోరేజీలు లేక దళారులు చెప్పిన ధరలకే రైతులు అమ్మాల్సిన దుస్థితి ఏర్పడింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు అరటి రైతుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి అరటి రైతులను ఆదుకోవాలని, పులివెందులలో కోల్డ్ స్టోరేజీని శరవేగంతో పూర్తి చేశారని, ఎన్నికల కోడ్‌తో కోల్డ్ స్టోరేజీ ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కోల్డ్ స్టోరేజీని ప్రారంభించి అరటికి గిట్టుబాటు ధర కల్పించి అరటి రైతులను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, లేకపోతే అరటి రైతులు తీవ్ర నష్టాలు చవి చూడాల్సి వస్తోంది. అరటి పంటకు సాగుకు ఎకరాకు మొదటి పంటకు రూ.2.50లక్షలు, రెండవ పంట రూ.70వేల నుంచి రూ.1.30లక్షలు, మూడవ పంటకు రూ.50వేలు రైతులు ఖర్చు చేస్తున్నారు. అంచనాల మేరకు పంట దిగుబడి వస్తే ఎకరాకు మొదటి పంటకు 20 నుంచి 22 టన్నులు, రెండవ పంట 16 నుంచి 17 టన్నులు, మూడవ పంట 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అరటి పంట ద్వారా పలువురు కూలీలకు ఉపాధి లభిస్తుంది కానీ అరటి రైతులను దళారులు దోచుకుంటుండటంతో నష్టం వాటిల్లుతోంది

రైతులకు నష్టపరిహారం అందించాలి



నాకున్న నాలుగు ఎకరాలలో అరటి సాగు చేశాను. అరటి కోద్దామనుకున్న సమయంలో ప్రకృతి వైపరీత్యంతో పంట నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. విధిలేని పరిస్థితిలో పడిపోయిన అరటి గెలలను దళారులను ఎంతో కొంత ఇచ్చి తీసుకెళ్లాలని బతిమలాడి తీసుకెళ్లేటట్టు కనిపించడంలేదు. కావున ప్రభుత్వం అరటి రైతులకు నష్టపరిహారం అందించి ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని కోరుతున్నాం.
– శ్రీనివాసులు, అరటి రైతు, సింహాద్రిపురం

కరువు మండలంగా ప్రకటించాలి



మండలంలో అరటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో అధికారులు పర్యవేక్షణలో మంచి అరటి మొక్కలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే అరటి రైతులు ఆర్థికంగా బలపడడానికి దోహదడతారు. లేకపోతే రైతులు చాలా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలవలన నష్టపోయిన అరటి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి, సింహాద్రిపురం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలి.
– కిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, సింహాద్రిపురం

జీఓ నంబర్ 77ను రద్దు చేయాలి

కమలాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ నంబర్ 77ను ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని పీడీఎస్‌యూ వైఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని డీటీ అహల్యకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. యువగళం పాదయాత్ర ద్వారా తమ ప్రభుత్వం వస్తే జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారన్నారు. అలాగే పీజీ కోర్సులు చేసే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని వారు తెలిపారు.

గర్భిణులకు స్కానింగ్

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ స్రవంతి సమక్షంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ స్కానింగ్ పరీక్ష ద్వారా తల్లి గర్భంలో పిండం అభివృద్ధి, బిడ్డ ఎదుగుదల, లోపాలు, గర్భం స్థితిగతులను తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లెలో గ్రామస్తులు, టీటీడీ నిధులు, సహకారంతో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభం ప్రతిష్టాపన శాస్త్రోకంగా నిర్వహించారు.ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

లయోలా కళాశాలలో క్యాంపస్ సెలెక్షన్లు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఆల్ డిక్సన్, ఆల్ డిగిటెక్ కంపెనీలు క్యాంపస్ సెలెక్షన్లు నిర్వహించారు. ఈ సెలెక్షన్లకు 170 మంది విద్యార్థులు హాజరు కాగా, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి ఆల్ డిక్సన్ కంపెనీకి 50 మంది, ఆల్ డిగి టెక్ కంపెనీకి 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ ఆంటోనిస్వామి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఈమెయిల్స్ ద్వారా త్వరలో కాల్ లెటర్స్ అందుతాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వన, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రమణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించండి

చక్రాయపేట : మండలంలోని శ్రీగండి ఆంజనేయ స్వామి దేవస్థానంలో దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఆలయ సిబ్బందికి, ఆలయ పరిపాలన అధికారికి, దివ్యాంగులకు, వృద్ధులకు దర్శనం కల్పించాలని కనీస అవగాహన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజను కలిసి దివ్యాంగులకు, వృద్ధులకు దర్శనం కల్పించాలని కోరామని, దీనికి ఆయన వెంటనే స్పందించి ఖచ్చితంగా దివ్యాంగులకు, వృద్ధులకు దర్శనం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఈశ్వరయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గుట్టు చప్పుడు కాకుండా తనిఖీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు హోటళ్లను విజిలెన్స్ అధికారులు తూ తూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి నామమాత్రంగా కేసులు పెట్టి తర్వాత మొదటి తప్పు కింద వదిలేసి వారి వద్ద నుంచి మామూళ్లు వసూళ్లు చేసినట్లు సమాచారం. అసలు తనిఖీలు చేస్తున్నట్లు మీడియాకు సమాచారం లేకుండా తనిఖీలు చేయడమేమిటని పలువురు చర్చించుకుంటున్నారు. విజిలెన్స్ అధికారులు తమకు నచ్చిన వారికి సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం పులివెందుల పట్టణంలోని పలు హోట్లళ్లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు నారాయణప్ప, శివన్న, బాబు మోజేస్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌లు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఓ హోటల్‌లో 8, మరో హోటల్‌లో 7 గృహ అవసరాల సిలిండర్లను స్వాధీనం చేసుకుని పంచనామ ద్వారా జప్తు చేసి పులివెందుల సివిల్ సప్లయ్ డీటీకి అప్పగించారు. దీని ఆధారంగా 48 గంటల్లోపు కడప జేసీకి, కోర్టులో కేసు ఫైల్ నమోదు చేశారు. ఇంత జరుగుతున్నా మీడియాకు ఎటువంటి సమాచారం లేకుండా విజిలెన్స్ అధికారులు గోప్యంగా ఉంచడానికి గల కారణాలు ఏమిటో అర్థం కావడం లేదని పలువురు బహిరంగంగా పేర్కొంటున్నారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

సైబర్ సెక్యూరిటీ పరిశోధనలకు పీహెచ్‌డీ పట్టా



పట్టా పొందిన రఘునాథ్ కుమార్

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో పనిచేస్తున్న రఘునాథ్ కుమార్‌బాబుకు సైబర్ సెక్యూరిటీలో పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీ పట్టా లభించింది. జెఎన్‌టీయూ కళాశాలలోని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రఘునాథ్ కుమార్‌బాబు పనిచేస్తూ చెన్నైలోని బిగ్ డేటా విత్ సైబర్ సెక్యూరిటీలో నాలుగేళ్లగా పీహెచ్‌డీ చేస్తున్నాడు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

పులివెందుల రూరల్ : పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. బుధవారం అచ్చివెళ్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 1000 రోజుల సంరక్షణపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా బిడ్డ కడుపులో పడినప్పటి నుండి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు బిడ్డ సంరక్షణ గురించి ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విశ్రాంతి తీసుకోవాలని తెలియజేశారు. అధికారులు చెప్పే సూచనలు, సలహాలను గర్భిణులు, బాలింతలు తప్పక పాటించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు, గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని, మహిళా సంరక్షణ కార్యదర్శి త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ఎర్రగుంట్ల : పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు బుధవారం సాయంత్రం స్టేషన్ ఆవరణలో పట్టణ సీఐ నరేష్‌బాబు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్‌ప్రవర్తనతో మెలగాలన్నారు. ఘర్షణలో పట్టుబడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. ప్రశాంత జీవితం కొనసాగించాలని ఆయన సూచించారు.

అగ్ని ప్రమాదాలు జరిగితే 101కు డయల్ చేయండి



అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో చేసి చూపిస్తున్న జనార్ధన్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది

కమలాపురం : వంటింట్లో మహిళలు జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలని, ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణం 101కు డయల్ చేయాలని ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పట్టణ పరిధిలోని రెడ్డీస్ కాలనీలో మహిళలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటింట్లో లేదా ఎక్కడైనా అకస్మాత్తుగా మంటలు వ్యాపించగా తక్షణం 101కు డయల్ చేయాలన్నారు. తర్వాత ఇంటికి ఉన్న తలుపులు, వాకిళ్లు తెరిస్తే లీకైన గ్యాస్ బయటకు వెళ్తుందన్నారు. మహిళలు తమ వంట ముగియగానే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ఒక వేళ ఇండ్లకు తాళం వేసి ఇతర ఊర్లకు వెళ్లినపుడు రెగ్యులేటర్‌ను పూర్తిగా సిలిండర్ నుంచి తీసి వేయాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు లైట్లు ఆన్ లేదా ఆఫ్ చేయరాదన్నారు. గ్యాస్ గాలి కంటే బరువుగా ఉంటుంది కనుక అది కిందికే వెళుతుందని, అందు కోసం సిలిండర్ ఉంచే ప్రాంతంలో కింది భాగంలో ఒక చిన్న కిటికీ ఉంచాలని, లీకైన గ్యాస్ ఈ కిటికీ గుండా బయటకు పోతుందన్నారు. అనంతరం వంటింట్లో జరిగిన అగ్ని, ఎలక్ట్రిక్ ప్రమాదాలను ఎలా ఆర్పాలి, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలను ప్రత్యక్షంగా డెమో చేసి చూపించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : అగ్ని ప్రమాదాలపట్ల మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి సునీల్‌కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని రోటరీపురం గ్రామంలో అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందించాలన్నారు. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచరాదన్నారు. కాల్చిన సిగరెట్లు, బీడీలు. అగ్గిపుల్లలు ఆర్పకుండా పారివేరాదన్నారు. ముఖ్యంగా మహిళలు ఇళ్లలో గ్యాస్ లీకేజీ అయిన వెంటనే అధికారులు చెప్పే జాగ్రత్తలు సూచనలు పాటించాలన్నారు. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్ వాల్వు ఆపి వేయాలన్నారు అటువంటి సమయంలో ఎలక్ట్రికల్స్ స్విచాఫ్ చేయాలని, ఆన్ చేయకూడదన్నారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : గ్యాస్ ప్రమాదాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి బి.శివరామిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని రాజీవ్‌కాలనీలో వంట గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గదిలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించినప్పుడు ఏ విధంగా అదుపు చేయాలనే విషయాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సిలిండర్ వాడకం గురించి ప్రదర్శన చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 101 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్లు, ఆపరేటర్ శివకుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..


జమ్మలమడుగు రూరల్ : అగ్ని ప్రమాదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపకశాఖ అధికారి సత్యంరెడ్డి తెలిపారు. కన్నెలూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు కాటన్ తడి కాని గోనె సంచిని నీళ్లతో తడిపి సిలిండర్‌పై వేస్తే మంటలు అదుపులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

చక్రాయపేట : వర్షాలు లేక పంటలు దెబ్బతిని అవస్థలు పడుతున్న రైతులను దృష్టిలో ఉంచుకుని చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీపీ మాధవీ బాలకృష్ణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభాభవణంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు లేచి మండలంలో వర్షాలు లేక పలు గ్రామాల్లో తాగను కూడా నీళ్లు లేవన్నారు. బోర్లు ఎండి పోవడంతో రైతులు చంటి బిడ్డల్లా చూసుకున్న నిమ్మ, మామిడి తోటలు ఎండిపోతుంటే దిక్కుతోచక అల్లాడుతున్నారు. కొందరు రైతులు తోటలను దక్కించు కొనేందుకు ట్యాంకర్లతో నీటిని తోలుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత జగనన్న ప్రభుత్వంలో రైతులకు లబ్ధి చేకూరు తుండేదని నేడు రైతుల గురించి పట్టించుకునే నాథుడేలేడన్నారు. రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని వారు సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కుళాయమ్మ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గఫార్, వేదమూర్తి, ఎంపీటీసీ సభ్యులు లీలావతి, నౌషాద్ బీ, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, సర్పంచులు కిరణ్‌కుమార్ రెడ్డి, లక్షుమయ్య, నరసింహులు, హరిశేఖర్ నాయుడు, హర్షాద్, శంకర్‌రెడ్డి, గంగయ్య, పురుషోత్తంనాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలుశాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుంచి అంకాలమ్మ తిరునాల



విద్యుత్ దీప కాంతులతో అంకాలమ్మ ఆలయం

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో శ్రీఅంకాలమ్మ తిరుణాల మహోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామపెద్దలు, ప్రజలు తెలిపారు. ఈనెల 17వ తేదీన గురువారం అంకాలమ్మ ఆలయంలో గణపతిపూజ, కలశ స్థాపన, పంచామృతాభిషేకం, తదితర పూజలు, 20వ తేదీన ఆదివారం ప్రత్యేక పూజలతోపాటు కడపనాగాయపల్లె నుండి కుంకుమ బండి కార్యక్రమం ఉంటుందన్నారు. 24వ తేదీన గురువారం ప్రత్యేక పూజలతోపాటు బొజ్జాయిపల్లె నుండి కుంకుమ బండి వస్తుందన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 24వ తేదీన ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు సాయంత్రం అమ్మవారి కల్యాణం జరుగుతుందన్నారు. అలాగే 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం నుంచి న్యూ కేటగిరి విభాగం ఎద్దులచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.80వేలు, రూ.70వేలు, రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేల నగదు బహుమతులు ఉంటాయన్నారు. భక్తులు ఈ తిరునాల మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త

వేంపల్లె : కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త అని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు.

బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ కళాశాలలో కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక దూరాచారాలను కూకటి వేళ్లతో రూపుమాపేందుకు అయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న ఉచిత వడుగులు

జమ్మలమడుగు : మే 4వ తేదీ ఆస్థానయే గౌసియా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుపేద ముస్లిం బాలురకు ఉచిత వడుగుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. ఎవరైనా ఖత్నా(వడుగులు) చేయించుకునే వారు పేర్లను నమోదు చేయాలన్నారు. గౌసియా షాదీఖానా ఎదురుగా ఉన్న ఏటీఎస్ సప్లయర్స్ షాపులో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుపేద ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన

తొండూరు : స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య హాజరై మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డకు రెండేళ్లు పూర్తయ్యే కాలాన్ని 1000 రోజుల సంరక్షణగా పరిగణింపబడుతుందన్నారు. ఈ కాలంలో గర్భిణులు, బాలింతల సంరక్షణకు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటనారాయణ, సీసీ ఆంజనేయులు, మహిళా పోలీసు గురుప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శ్రీగణేష్‌సాయి 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని అంకాలమ్మపేటకు చెందిన రామలక్షుమ్మ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్ర సేకరణ కేంద్ర సభ్యులు కార్నియాలను సేకరించారు.